# గజదొంగలు



మొలకలపల్లి కోటేశ్వరరావు

"నానా... మా క్లాసు రాముకి వాళ్ళ నాన వాచీ కొనక్కొచ్చాడు. బలే వుంది. నాగ్గూడా వాచీ కొని పెట్టవా, రేపు శనగల డబ్బులు వచ్చినాక" అనిల్ అడిగాడు.

"వాడిక్కొంటే నాగ్గూడా కొనాల్సిందే" వెంటనే అందుకుంది ప్రతిభ. వాకిటి దగ్గర కూర్చుని వాళ్ళమ్మతో జడ వేయించుకుంటూ.

బుచ్చయ్య ఇంటి పొరుగునేవున్న ఎరువుల షాపువాళ్ళ పేపరు తీసుకొచ్చి చూస్తున్నాడు. వాళ్ళ మాటలు వినపడినా పేపర్‌లో లీనమై జవాబు చెప్పలేదు.

"చెప్పు నానా, కొనిపెడతావా?" మళ్ళీ అడిగాడు అనిల్.

"సర్లేరా" అన్నాడు బుచ్చయ్య. ఎలాగూ కొనిపెట్టేదిలేదు. ఆమాట చెప్పి వాళ్ళని ఇప్పటినించే ఎందుకు నిరాశ పరచాలని ఆయన వుద్దేశం.

పిల్లలుగదా, ఇప్పుడు వున్న గుబులు తరువాత వుండదు. సహజంగానే రేపటికి మర్చిపోతారు. ఒకవేళ గుర్తువున్నా ఇంకేదో వస్తువుమీదకి ధ్యాసపోతుంది. దాన్ని కావాలని అడుగుతారు. ఈ విషయం బుచ్చయ్యకి తెలుసు. అందుకే వాళ్ళు కోరుకునేది ఏదీ కాదనడు.

అనిల్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ప్రతిభ తొమ్మిది. ఆ ఇద్దరూ ఆయన పిల్లలు.

"నిజంగా కొనిపెడతావా నానా?" తండ్రి మాట మీద విశ్వాసంలేని అనిల్ తన ఆశనీ, నమ్మకాన్నీ ధృడపరచుకోవడానికి మళ్ళీ అడిగాడు.

"చూద్దాం లేరా!"

"నీవు చూద్దామంటే మేం నిజంగా చూసినట్టేలే!" అన్నాడు అనిల్ నిరసన ధ్వనితోనూ, నిరాశగానూ.

"కొనిపెడతాలే పోరా!"

"జీన్స్ పేంటూ, టీషర్టూ కొనిపెడతానని నిరుడు పుట్టినరోజప్పుడు చెప్పావ్! కొనిపెట్లే. మళ్ళీ పుట్టినరోజు కూడా ఇంక పదిరోజుల్లో వచ్చిద్ది! ఈ పుట్టినరోజు కైనా తెస్తావనుకుంటే అమ్మ కొట్లో గుడ్డలు తెచ్చా, టైలర్‌క్కూడా ఇస్తిమీ!"

"ఒరేయ్... డబ్బులు వూరక ఏమన్నా వస్తన్నయ్యేందిరా? నీకు టీ షర్టులూ, జీన్సులూ కొనాలంటే పచ్చనోట్లు కావాలి. మళ్ళీ అవికూడా తుక్కాసియ్యి కొంటే మూడోనాటికే పోతయ్యి! కొనుక్కునేది ఏదయినా మంచిది చూసి కొనుక్కోవాలి!"

"కొట్లో మామూలు గుడ్డలు మాత్రం పచ్చనోట్లు లేకుండా చౌగ్గా వస్తన్నయ్యేంది? కుట్టుకూలితో లెక్క చూసుకుంటే ఇవి కూడా వాటంత అవతయ్యి! ఎనకటి రోజుల్లో వుంటే ఎట్ట? పచ్చనోటు అని పేరే కాని దానికి రవిగ్గుడ్డ రావడంలా!" అంది ప్రతిభకి జడవేస్తున్న వాళ్ళమ్మ నిర్మల.

"నాకు అవేం వద్దుగానీ వాచీ కొనిపెట్టు నానా!"

"ఎన్ని డబ్బులు రావడంలేదూ, పోవడంలేదూ! పిల్లవాడు వాచీ అడిగితే ఇంతసేపు ఆలోచించాలా?" అంది నిర్మల.

"కూచుని మాటలు అయితే చెపుతావు? వాచీలు వూరక ఇయ్యరు. డబ్బుతోటి కూడుకున్న యవారం!"

"వేలు కావాలా, లక్షలు కావాలా?"

"వందలైనా కావాలిగా!"

"అయితే కొనిపెట్టవా?" అని బాగా నిరాశతో అడిగాడు.

"రేపు ఎప్పుడో ఒంగోలు పోయినప్పుడు గట్టిగా తెచ్చిపెడతాలేరా!" ఇక తప్పేటట్లు లేదనుకుని, వాడికి నిజమైన ప్రామిస్ చేసాడు బుచ్చయ్య.

"మనింటికి వచ్చే అమ్మాయి క్లాసు ఆడపిల్లలందరికీ చాలా వస్తువులున్నయ్యి. మనమ్మాయికే ఏంలేవు బొత్తిగా! శనగలు అమ్మిన తరవాత నాకు పదివేలియ్యి, అమ్మాయికి ఏదన్నా వస్తువు చేపిస్తా! బోసిమెడ, బోసి చేతుల్తోటి దిబూచిగా వుంటంది!" అంది నిర్మల.

"పది రూపాయలు అడిగినంత తేలికగా అడిగావేమే పదివేలు కావాలని! శనగలు అమ్మితే మనకి వచ్చేది రూపాయి అయితే అక్కడ రెండు రూపాయలు ఎదురు చూస్తన్నయ్యి!"

"మనకి ఎన్ని అప్పులు వున్నయ్యేంది? ఇయ్యేడే నువ్వు అమ్మాయికి వస్తువు చేయించలేకపోతే ఇంకెప్పుడు చేపిస్తా? ఇయ్యేడు పండినట్టు ఎప్పుడన్నా పండిందీ శనగా? నిన్న సుబ్బయ్యవాళ్ళ కూతురికి పన్నెండు సవర్లు బంగారం కొనిపెట్టాడంట! చెయినూ, నెక్లెసూ, గాసులూ ఇంకా ఎయ్యో తెచ్చారు ఒంగోలు పోయి! నువ్వు పదివేలు లేవంటంటివీ?"

"వాడు సొంత పొలమేగాకుండా పదెకరాలు కౌలుకి తీసుకుని శనగయేసాడు. ఇయ్యేడు పాటు కుదిరిందీ- లక్షా, లక్షన్నర మిగిల్నియ్యా! వాడు ఇంక ఏదైనా కొంటాడూ, చూపిస్తాడూ! వాడితోటి మనం ఎక్కడ తూగుతాం?"

"వాళ్ళతోటీ, వీళ్ళతోటీ తూగమని కాదు. ఆయన పొలం కౌలుకి తీసుకుని యేస్తే లక్షన్నర మిగిల్నియ్యా! సొంతమే మనకి ఎనిమిది ఎకరాల పొలం వుందిగా! ఆ లెక్కన మనకి అరవై, డెబ్బయ్ వేలన్నా మిగలాలగా!"

"వాళ్ళు ముందు 19 వందల మీద అమ్ముకున్నారు. ఇయ్యాల ఆరేటేదీ? పదహారు వందలక్కూడా అడిగేవాడు లేకపోయా! చూడు, రేటులోనే ఎంత తేడా వచ్చిద్దో!"

"వారం రోజుల్లోనే ధరలు ఇంత అడ్డగోలుగా తగ్గిపోవడం ఎందయ్యా విచిత్రంగా?"

"ఇప్పుడు 16 వందలంటన్నారు. అయినా గట్టిగా నిలబడి కొనేవాడు ఎవడూ లేడు. ఈ రేటు ఇట్ట తగ్గకుండా ఆగితేచాలు, జాతకులమే! ఇయ్యేడు పొగాక్కూడా లేకపోయేసరికి ఆ పొలం కూడా శనగేనాయె! ఇంతకంటే రేటు మాత్రం ఏంవచ్చిద్దీ?"

వాకిలికి రెండుపక్కలా శనగల గోతాలు మెట్టుకట్టి వున్నాయి. ఇంటి లోపలకి వెళ్ళడానికి వాకిలి ఎదురు కొంత జాగా వదిలిపెట్టి రెండువైపులా గోతాలతో పంచ అంతా నింపారు.

గడప మీద కూర్చుని నిర్మల కూతురికి జడవేస్తుంటే, కొద్దిగా ఎడంగా కింద కూర్చునే పేపరు చూస్తున్నాడు బుచ్చయ్య.

"బళ్ళో మేష్టారు ఫీజులు అడుగుతున్నాడు నానా! ఇవ్వని వాళ్ళని రేపట్నించీ నిలబెడతారంట!" ప్రతిభ అంది.

"నన్ను కూడా రోజూ అడుగుతున్నారు. రోజూ అడిగిచ్చుకోటం ఏం బాగుండిద్ది?" కోరస్ పలికాడు అనిల్.

"శనగలు అమ్మిన వెంటనే కడతామని చెప్పండ్రా! రోజూ అడగొద్దని మేష్టారుకి చెప్పండి. డబ్బు రానిది ఏం కడతాం?"

"మేష్టారు తోటి రోజూ అడగొద్దని ఎట్ట చెపతాం నానా?" ప్రతిభ అంది.

పిల్లలు ఇద్దరూ వూళ్ళోవున్న ప్రయివేట్ స్కూల్‌కి వెళ్తున్నారు. ఇద్దరిమీదా ఏడాదికి 24వందల ఫీజు కట్టాలి. అది రెండు వాయిదాల్లో. మొదటి వాయిదా పన్నెండు వందలు ఎప్పుడో కట్టారు. ఇప్పుడు రెండో వాయిదా మరో సగం కట్టాలి.

చేలో నించి వచ్చిన పంట తొందరగా అమ్ముడుపోతే బాగుండు బాకీలు తీర్చుకుని అవసరాలు జరుపుకోవచ్చని ఇంట్లో అందరికీ వుంది.

చేలోనించి శనగలు మొత్తం ఇంటికి వచ్చి అప్పటికి నాలుగురోజులే అయింది.

పదిరోజుల క్రితం మొదట్లో పంట ఇంటికి వచ్చిన వాళ్ళవి, వచ్చినట్లే వ్యాపారులు తొమ్మిది వందలు చేసికొన్నారు. రెండు రోజుల తరువాత తగ్గించి 18 వందలూ, తరువాత 17 వందలకీ కొని, ఇప్పుడు పదహారు వందలు అంటున్నారు.

"మనయ్యి ఎన్ని కింటాళ్ళు అవతయి నానా శనగలూ?" అనిల్ అడిగాడు.

"అరవై కింటాళ్ళు అవతయ్యిరా! పైన ఐదారు అయితే అవి విత్తనాలకి వుంచుకుందాం. వచ్చేసాల్లో విత్తనాలప్పుడు కింటా మూడేలు పలికిద్ది!"

"ఆరు గోతాలు మినుములు అయితే అవికూడా అమ్ముకోకపోతిమీ! శనగలు ఇంకా తగ్గుతయ్యేమొ! ఎవురన్నా కొంటే అమ్ముకుంటేనే బాగుండిద్ది!" అంది నిర్మల.

"నేను గూడా అమ్ముదామనే చూస్తన్నానే!"

"శనగలు కూడా మినుముల మాదిరిగా అవతయ్యేమొ!"

"ఏమొ మరి" అన్నాడు బుచ్చయ్య.

మినపపంట శనగపంట కంటే నెల రోజుల ముందు వేస్తారు. నెల రోజుల ముందు నూర్పుడికి వస్తుంది.

మినుములు మొదటగా ఇంటికి వచ్చిన వాళ్ళవి వ్యాపారులు 29 వందల మీద కొనుగోలు చేసారు. తరువాత క్రమంగా రోజూ 50, 100, 200 ఇలా అడ్డ గోలుగా తగ్గించుకుంటూ చివరకి ధరని 19 వంద




లకి దించారు.

ఈ ధరల తగ్గుదల కేవలం 15 రోజుల వ్యవధిలోనే జరిగిపోయింది.

అంజయ్య అనే రైతు రెండు ఎకరాలు మినుము వేసాడు. అతనికి పది క్వింటాళ్ళు అయ్యాయి. అవసరంపడి, అతను తన పంటని 19 వందల మీదనే అమ్ముకున్నాడు. ధరలోనే అతను పది వేలు పోగొట్టుకున్నాడు. తనకి ఆ పంట మీద ఎంత ఆదాయం వస్తుందనుకున్నాడో అది అంతా వ్యాపారుల పరమైపోయింది. ఎంతో ఆశతో, నాలుగు రూపాయలు వస్తాయని భావించి తినీతినకా ఏడాది పొడుగునా చాకిరీ చేసుకున్న అతనికి చివరికి చాకిరీ, రెక్కలు ముక్కలు కావడం తప్ప ఏమీ మిగల్లేదు. రెండెకరాలు ఆ వక్కి బక్క బడుగు రైతుకి ధరలోనే పది వేలు పోవడంతో అతను పడిన బాధ, అనుభవించిన వేదన వర్ణనాతీతం.

మినుముల దెబ్బనించి రైతులు ఇంకా కోలుకోలేదు. శనగలు కూడా మినుముల మాదిరిగా ధర తగ్గిస్తారేమో అని రైతులు భయంతో గజగజలాడిపోతున్నారు.

"ఇంకా ఒకటీ రెండేళ్ళలో పిల్లలిద్దరూ కాలేజీ చదువులకి వెళ్తారు. మన దగ్గర ఇప్పుడు కాణీ లేదు. రేపు అప్పటికప్పుడు డబ్బు రమ్మంటే ఎక్కడ్నించి వస్తుంది? ఇయ్యేడు పంట బాగా పండింది. పంట అమ్మిన తరువాత ఎంత మిగిల్తే అంత ఖర్చు పెట్టకుండా బేంకిలో వేద్దామనుకున్నా! అవి రేపు పిల్లల చదువులకి అక్కర కొస్తయ్యనుకున్నా! ధర ఇలా వుంటే ఎంత మిగలబోతాయి?" అన్నాడు నిరాశగా బుచ్చయ్య.

"ఇంకా తగ్గకముందే అమ్ముకుందాం. కొన్నిసార్లు తొందరచేసి అమ్ముకున్నోళ్ళే అదృష్టవంతులు. మినుములు చూడు, ముందు అమ్ముకున్నోళ్ళకీ, వెనక అమ్ముకున్నోళ్ళకీ ఎంత తేడా వచ్చిందో!" అంది నిర్మల.

తాత్కాలిక వ్యాపారానికి కొన్ని లారీలు కొనుగోలు చేసిన తరువాత పెద్దస్థాయి వ్యాపారులు అందరూ సిండికేట్‌గా ఏర్పడి కొనుగోళ్ళు ఆపేసారు.

రైతుల్లో కలవరం బయల్దేరింది. పండినపంట! కొనేవాడు లేడు! మరో పక్క అవసరాలు చేతిలో చిల్లిగవ్వలేని వాళ్ళు అనేకమంది రైతులు!

డబ్బు అవసరం పడిన రైతులు తమ పంటని కొనుగోలు చేయమని స్థానిక వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు.

స్థానిక వ్యాపారులు బ్రోకర్ ఆఫీసులకి ఫోన్లమీద ఫోన్లు కొట్టడం మొదలు పెట్టారు.

ధరలు తగ్గుతున్న క్రమంలో వ్యాపారులు మినుముల్లో బాగా తిన్నారు. బ్రోకర్ ఆఫీసులో పాతిక వందలకి బేరం ఇచ్చి, రైతుల వద్ద 22వందలు చేసి పట్టిన వాళ్ళు వున్నారు. లారీకి 25, 30 వేలు ఒక్కరోజులో సంపాదించారు.

మరుసటిరోజు పరిణామాలు ఎలా వుంటాయో, చిక్కిందే దక్కుదల, దక్కిందే బొక్కుదల అనీ- శనగలు కూడా మినుముల మాదిరిగా కాజేద్దామనీ వ్యాపారులు గాదెకింది పందికొక్కుల్లా ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

వారంరోజుల తరువాత పై వ్యాపారులు కదిలారు. కొనుగోళ్ళు మొదలు పెట్టారు.

"మావి కాటాలు వేసుకొండీ, మావి కాటాలు వేసుకొండీ!" అని రైతులు వ్యాపారుల చుట్టూ ప్రదక్షిణలు సాగిస్తున్నారు.

వ్యాపారులు కూడా టకటకా వచ్చిన రైతుల వద్దనించి వచ్చిన వాళ్ళవి వచ్చినట్లే కొనుగోళ్ళు వేగంగా చేస్తున్నారు.

రైతుల వద్ద సరుకు తగ్గిపోవటం మొదలైన తరువాత ధర నెమ్మదిగా పెరగసాగింది.

"ఇయ్యాల 1750 అంటన్నారయ్యా శనగలూ! అమ్ముకోటం నయం! మళ్ళీ 16 వందలకి వస్తే దండగ పడతాం!" అంది నిర్మల.

బుచ్చయ్య కూడా అమ్మదామనే వుద్దేశంతో వున్నాడు. నిర్మల కూడా చెప్పడంతో ఆనవాయితీగా తాము సరుకు అమ్మే వ్యాపారి వద్దకి వెళ్ళి పట్టుబడి చేయమని చెప్పాడు.

"కేష్‌బేరం లేదు. 15 రోజుల సైటుకి ఇచ్చే పనయితే పడతాం. ఊళ్ళో అందరివీ అట్నే పడతన్నాం!" చెప్పాడు వ్యాపారి.

ఆమాటే ఇంటికి వచ్చి నిర్మలకి చెప్పాడు బుచ్చయ్య.

"రేపు పదిహేడు వందలకో, పదహారు వందలకో అమ్ముకునేకంటే సైటు అయినా 1750కి అమ్ముకోవడం నయంకదూ! 15 రోజులంటే ఎంతలో తిరిగొస్తయ్యి! మళ్ళీ తగ్గకముందు అమ్ముకుంటేనే బాగుండిద్ది!" అంది నిర్మల.

బుచ్చయ్య 'సరే' అని చెప్పడంతో, ముఠా కూలీలు వచ్చి జల్లెడలు పట్టి కాటాల్ను వేసారు.

బుచ్చయ్య శనగలు మొత్తం అరవై క్వింటాళ్ళు అయ్యాయి.

పదిరోజుల్లోనే రైతులు అందరూ తమ సరుకుని వ్యాపారులకి తొందరచేసి అమ్ముకున్నారు.

ఎవరో నలుగురు మొండి రైతులు మాత్రం అమ్ముకోకుండా చూద్దాం అనే వుద్దేశంతో నిల్వవుంచారు.

రైతుల వద్ద నించి పంట వ్యాపారుల చేతిలోనికి పోవటం- హఠాత్తుగా ధర పెరగడం ఒక్కసారిగా జరిగిపోయింది.

ఇప్పుడు మూసాంబీ శనగల ధర 2350!

"ఒక కింటా కాదు, రెండు కింటాళ్ళు కాదు, అరవై కింటాళ్ళ శనగలు! 1750 ఎక్కడా, 2350 ఎక్కడా? కింటాకి ఆరు వందల లెక్కన 60 కింటాళ్ళకీ ముప్పయిఆరు వేల రూపాయల తేడా! చూస్తాచూస్తా కళ్ళముందే పదిరోజుల్లోనే ఎంత డబ్బు పోగొట్టుకున్నాంరా బాబోయ్! అమ్ముకోకపోయినా బాగుండేది!" అని గుండెలు బాదుకున్నాడు బుచ్చయ్య.

"శనగల డబ్బులు వచ్చినాక వాచీ కొని పెడతానంటివే, కొనిపెట్టవా నానా?" అనిల్ అడిగాడు.

"ఏహైపోరా!" అసలే చిరాకుతో వున్న బుచ్చయ్య కొడుకుని విదిలించి కొట్టాడు.

"వాడిమీద కోప్పడి ఏం వుపయోగం? పసిబిడ్డ వాచీ అడిగితే కొనిపెట్టలేకపోతిమీ! ఒక చొక్కాముక్క కొనేగతిలేకపోయా! వాళ్ళకి సకాలంలో బడి జీతాలు కట్టలేకపోతిమీ! శనగల్లో ఎంత దండగ పడ్డామో చూడు!" అని నిర్మల కూడా లబోదిబోమని బాధ పడింది.

"డబ్బు విషయంలో ఎంత జాగర్తగా వున్నా ఏంలాభం? ఒక రూపాయి కర్చు పెట్టాలంటే పదిసార్లు ఆలోచిస్తాం. చూస్తా చూస్తా కాణీ కర్చుపెట్టలేం! పిల్లలు కొనుక్కోవడానికి పావలా ఇవ్వడానికి అల్లాడిపోతాం! ధరలో చూడు ఎంత పోయిందో!" అని బుచ్చయ్య మనసులో ఏ వెయ్యిసార్లో అనుకుని, పైకి ఏ వంద సార్లో అన్నాడు.

బుచ్చయ్యకి పోయిన డబ్బే తలపు కొస్తూ అదే మనోవ్యాధి అయిపోయింది.

బుచ్చయ్య ఒక్కడేకాదు, బుచ్చయ్య లాంటి రైతులు ఎందరో!

పదిరోజుల వ్యవధిలో ఆ వూరి రైతాంగం కనీసం కోటిరూపాయలు పోగొట్టుకున్నారు.

ఈ డబ్బుని ఏ ఘరానా దొంగలు ఏ ఘరానా పద్ధతుల్లో కొట్టేసారు? రైతుల కష్టం వాళ్ళకి కాకుండా పోవడానికి కారకులు ఎవరు?

రూ. 8,50, 000 విలువైన బహుమతులు గెలుచుకోండి
No Entry Fee
మొదటి బహుమతి : యమహా మోటార్ సైకిల్ లేదా కలర్ టీ.వి.
కన్సొలేషన్ బహుమతులు టూ ఇన్ వన్ ట్రాన్సిస్టర్ ఫోటోగ్రాఫిక్ కెమెరా, రిస్ట్‌వాచ్ (ఎం.వి అండ్.హెచ్.పి స్కీం క్రింద)

| | | |
|---|---|---|
| 5 | 10 | 9 |
| 12 | 8 | 4 |
| 7 | 6 | 11 |

ఒక పోస్టు కార్డు పైన పెర్కొన్న నమూన ప్రకారం తొమ్మిది ఖాళీ స్కేర్‌లను గీచి 5 నుండి 13 వరకు అంకెలను ఉపయోగిస్తూ నిలువుగా, అడ్డంగాను , మూలల నుండి మొత్తం ఎటు కూడినా 27 వచ్చే విధంగా వ్రాయాలి. ఒక అంకెను ఒక సారి మాత్రమే ఉపయోగించాలి. మీ మీ ఎంట్రీలను 10 రోజులోగా పోస్టుకార్డుపై ఆర్డినరి మెయిల్ లో పంపండి. అందిన మొదటి 20 ఎంట్రీలకు మిక్సర్-కమ్ -గ్రైండర్ ఉచితంగా ఇవ్వబడుతుంది. అడ్రసు :

| | | |
|---|---|---|
| 6 | | |
| | 9 | |
| | | 12 |

BALAJI ENTERPRISES (V) Temple Road, Post Barari - 812 003. (Bhagalpur)